# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-08-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశవ్యాప్తంగా వినాయక చవితి పండుగను ప్రజలు ఈరోజు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు.**
2. **దేశంలో తయారయ్యే ఎలక్ట్రిక్ వాహనాలు ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి అవుతాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**
3. **ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకలను కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిన్న జాతికి అంకితం చేశారు.**
4. **దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.**
5. **యూరియా కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు.**

==========================

దేశవ్యాప్తంగా వినాయక చవితి పండుగను ప్రజలు ఈరోజు భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో ప్రజలు పెద్ద ఎత్తున వినాయక ప్రతిమలను, పూజా సామాగ్రిని కొనుగోలు చేసి విఘ్నాధిపతిని పూజిస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో వాడ వాడలా గణనాధుని ప్రతిష్టించి... పూజలు జరుపుతున్నారు. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టేందుకు మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలని ఈ సందర్భంగా పలు పర్యావరణహిత సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. అంతేకాకుండా... అనేక ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు... మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను ఉచితంగా అందజేస్తుండడం విశేషం.

------------------------

గణేశ చతుర్థి సందర్భంగా దేశ విదేశాల్లోని భారతీయులందరి కీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాష్ట్రపతి ఒక సందేశంలో ఈ విధంగా పేర్కొంటూ.. భగవాన్ గణేశుని జ్ఞానాధిపతిగా, శ్రేయోనిధిగా ఆరాధిస్తామని, ఏదైనా కొత్త పనిని మొదలుపెట్టేటప్పుడు ఆయన ఆశీర్వాదాలు కావాలని కోరుకుంటామని అన్నారు. మన పర్యావరణాన్ని కాపాడుకుంటూ స్వచ్ఛ హరిత, సమృద్ధితో కళకళలాడే దేశాన్ని నిర్మించే మార్గంలో కలిసి కట్టుగా ముందుకు సాగే ఉద్దేశంతో ఈ పండుగను జరుపుకుందామని రాష్ట్రపతి పిలుపునిచ్చారు.

------------------------

స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ ఆత్మ నిర్భరత దిశగా సాగుతున్న ప్రయాణంలో కీలకమైన హరిత రవాణా కార్యక్రమాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న గుజరాత్‌లోని హన్సల్‌పూర్‌లో ప్రారంభించారు. గుజరాత్‌లోని టిడిఎస్ లిథియం-అయాన్ బ్యాటరీ ప్లాంట్‌లో హైబ్రిడ్ బ్యాటరీ ఎలక్ట్రోడ్‌ల ఉత్పత్తిని ప్రారంభించిన అనంతరం సభను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ... గణనాథుని పండుగ వాతావరణం మధ్య మేడిన్ ఇండియా ప్రయాణంలో ఇది ఒక నూతన అధ్యాయమని పేర్కొన్నారు. భారత్‌లో తయారీ. ప్రపంచం కోసం తయారీ అనే ఉమ్మడి లక్ష్యం వైపు ఇదొక ముఖ్యమైన ముందడుగు అని ఆయన వ్యాఖ్యానించారు. దేశంలో తయారయ్యే ఎలక్ట్రిక్ వాహనాలు ఈరోజు నుంచి ప్రపంచ వ్యాప్తంగా 100 దేశాలకు ఎగుమతి అవుతాయని నరేంద్ర మోదీ తెలియజేస్తూ..

..వాయిస్..35 సెకన్లు

---------------------------

ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఇండో-పసిఫిక్, చైనా సరిహద్దుల్లో చేపడుతున్న వ్యూహాత్మక రక్షణ ప్రాజెక్టు పనుల్లో భాగంగా పీ-17 పేరిట స్వదేశీ సాంకేతికత, ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలతో కోల్‌కతా, ముంబయిలలో ఈ యుద్ధ నౌకలను భారత రక్షణ వ్యవస్థ నిర్మించింది. అత్యాధునిక యుద్ధ నౌకలు రెండింటినీ జాతికి అంకితం చేసిన అనంతరం రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఈ రెండు నౌకలు దాదాపు 149 మీటర్ల పొడవు ఉండి ఆధునిక ప్రత్యేకతలు కలిగి ఉన్నాయని చెప్పారు. ఈ నౌకలపై నుంచి సూపర్ సోనిక్, బ్రహ్మోస్ వంటి అస్త్రాలను నింగిలోని లక్ష్యాలను ఛేదించేందుకు ప్రయోగించవచ్చని రాజ్ నాథ్ సింగ్ పేర్కొంటూ....

..వాయిస్.. 33 సెకన్లు

---------------------------

దేశంలో సంపద సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా బ్యాంకులు పని చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా బ్యాంకర్లు తమ విధానాలను మార్చుకోవాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో పలు సంస్కరణలను తీసుకొచ్చిందని పేర్కొన్నారు. బ్యాంకులు, ప్రభుత్వ విధానాలు ఎప్పుడూ ప్రజలను నియంత్రించకూడదని, తదుపరి సంస్కరణల దిశగా వారిని ప్రోత్సహించాలని సూచించారు.

---------------------------

తెలంగాణలో యూరియా కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, సరఫరాపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. యూరియా విషయంలో కలెక్టర్లు జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలు రైతులకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ...

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

చేనేత కార్మికులకు త్వరలో రుణమాఫీ చేస్తామని తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నేతన్న పొదుపు నిధుల విడుదల కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 33 కోట్ల రూపాయల మేర చేనేత రుణాలు ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలో మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు.

---------------------------

వాయువ్య బంగాళాఖాతం, దాని సరిహద్దు ఒడిశా తీర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ...

వాయిస్..25 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 125వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 29వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

=====================